సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



రేషన్ బియ్యం పట్టివేత

జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం ప్రాంతాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని పోలవరం మండలం పట్టిసంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. 8లో ▸



పల్లె ప్రగతికి ప్రోత్సాహం

పల్లెల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన గ్రామాలకు అవార్డులు అందజేసింది. 8లో ▸

శ్రీవారి గ్రామోత్సవం



శ్రీవారి గ్రామోత్సవం ద్వారకా తిరుమల పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. చాత్మార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ గ్రామోత్సవం నిర్వహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం



మండల స్టాక్ పాయింట్లకు బస్సుల్లో పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పశ్చిమగోదావరి జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కేంద్రం నుంచి మంగళవారం ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం జిల్లా మేనేజర్ టి.భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల ద్వారా భీమవరం, కాళ్ళ మండలాలకు పుస్తకాలను పంపించారు. మేనేజర్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి పశ్చిమ గోదావరి పాత జిల్లా పరిధిలో 48 మండలాలకు ఇండెంట్ 32,78,721 పుస్తకాలు కాగా పాతబుక్స్ 1,17,669 బ్యాలెన్స్ ఉందన్నారు. ప్రస్తుతం కొత్త బుక్స్ 9,21,599 వచ్చాయని, మొత్తం 10,39,268 పాఠ్యపుస్తకాలు కేంద్రంలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రారంభం రోజున రెండు మండలాలకు 39,209 పుస్తకాలు పంపినట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన స్కూల్ బెల్ట్‌లు, బ్యాగ్‌లు, షూలు వివిధ సామగ్రితో పాటు పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతికి చెందిన అన్ని పాఠ్యపుస్తకాలు మారతాయని, 6, 7వ తరగతులకు సంబంధించి ఇంగ్లీషు పాఠ్యపుస్తకాలు మారతాయని వివరించారు.

27న డీఎస్సీ 98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీ–98 కౌన్సెలింగ్‌కు 13 మంది అభ్యర్థులు హాజరు కానందున తదుపరి వరుస క్రమంలో మరో 13 మందికి కౌన్సెలింగ్ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అర్హులైన 274 మందిని పిలువగా వారిలో 261 మంది మాత్రమే హాజరయ్యారు. వారికి ఇప్పటికే పోస్టింగులు ఇచ్చామన్నారు. ఆ జాబితాలో హాజరుకాని 13 మంది స్థానంలో తదుపరి వరుస క్రమంలో ఉన్న మరో 13 మందితో జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. వారికి ఈ నెల 27న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్టు ఫొటోలు, డీఎస్సీ 1998 హాల్ టిక్కెట్లు తీసుకుని ఏలూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

మే 1 నుంచి నాయీ బ్రాహ్మణులకు కనీస కమీషన్

కేశఖండన టికెట్ ధర రూ. 40కి పెంపు

ద్వారకాతిరుమల: దేవాలయాల్లోని కల్యాణ కట్టల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు కనీస కమీషన్‌గా నెలకు రూ. 20 వేలు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓపై రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సోమవారం విధివిధానాలు జారీ చేశారు. ఈ ప్రభుత్వ విధానాన్ని వచ్చే నెల 1 నుంచి అమలు చేయాలని ఆయా ఆలయాల అధికారులను ఆదేశించారు. ఏడాదిలో 100 రోజులు క్షౌ ర కర్మ జరిగే దేవాలయాల్లోని కల్యాణ కట్టల్లో పనిచేసే క్షురకులకు కనీస కమీషన్‌గా నెలకు రూ. 20 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 13న జీఓ ఎంఎస్ నంబర్ 110ని జారీ చేసింది. దీనికి సంబంధించి దేవదాయ శాఖ కమిషనర్ విధివిధానాలను జారీ చేశారు. ఆలయాల్లో ప్రస్తుతం ఉన్న కేశఖండన రుసుంను రూ. 25 నుంచి రూ. 40కు పెంచి, పూర్తి రుసుం క్షురకులకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 46 దేవాలయాలు, మఠాలు, కన్సాలిడేటెడ్ నాయీ బ్రాహ్మణులకు ఇది వర్తిస్తుందన్నారు. ఆ జాబితాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల ఉంది. ఇదిలా ఉంటే నాయీ బ్రాహ్మణులు 65 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఈ వృత్తిలో కొనసాగవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తెల్ల లుంగీ, బనియన్, విభూది, నామము, కుంకుమ, ఐడీ కార్డ్‌లను ధరించి, భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. నాయీ బ్రాహ్మణులకు ప్రతీ చెల్లింపు చెక్, ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారానే జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అందరు నాయీ బ్రాహ్మణులు సమష్టిగా సమ్మతిస్తేనే ఈ కనీస కమీషన్ హామీని అమలు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

పీఎం శ్రీతో స్కూళ్లకు మహర్దశ

- విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం
- ఏలూరు జిల్లాలో 18, పశ్చిమలో 21 పాఠశాలల ఎంపిక
- పాఠశాలలకు మరిన్ని సౌకర్యాలు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో విద్యా రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మన బడి నాడు – నేడు కార్యక్రమంతో కోట్లాది రూపాయల వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారు. అలాగే అమ్మఒడి పథకంతో ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా నూతన విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలకు మేలు చేయనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టి దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు కొన్ని ప్రామాణికాలు విడుదల చేసింది. ఆ ప్రమాణాలు పాటించే పాఠశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయనుంది.

ఏలూరు జిల్లాలో 18, పశ్చిమలో 21 పాఠశాలలు

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 1183 పాఠశాలలకు రిజిస్ట్రేషన్ చేసుకునే అర్హత కల్పించారు. కేంద్రం పొందుపరిచిన 44 అంశాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలు 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎం శ్రీ పథకం లబ్ధి కోసం ఎంపిక చేస్తారు. ఈ మేరకు ఏలూరు జిల్లాలో 18, పశ్చిమ గోదావరి జిల్లాలో 21 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు.



పీఎం శ్రీ పథకానికి ఎంపికైన కొవ్వలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఎంపికైన పాఠశాలలివే.. ఏలూరు జిల్లాలో అడవి నెక్కలం, గుండుగొలను, బుట్టాయగూడెం, చిన్నంపేట, యర్రగుంటపల్లి, కొవ్వలి జిల్లా పరిషత్ పాఠశాలలు, గణపవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోరుకొల్లు, గవరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామశింగవరం ఎంపీపీ స్కూల్, రంగాపురం, ముదినేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ముసునూరు ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, పల్లెర్లమూడి, కొప్పాక, గూటాల, వేలరుపాడు పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆచంట వేమవరం, చినకాపవరం, బల్లిపాడు, గూట్లపాడు, కలవపూడి, మొగల్తూరు, శివదేవుని చిక్కాల, మోగల్లు, మార్టేరు, కవిటం, తాడేపల్లిగూడెం, వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆకివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, భీమవరం జేఎల్‌బీ మున్సిపల్ హైస్కూల్, నరసాపురం మున్సిపల్ స్కూల్, ఎల్‌బీ చర్ల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, పాలకొల్లు 7వ వార్డులోని బీఆర్‌ఎంవీ మున్సిపల్ హైస్కూల్, పెంటపాడు పోస్ట్‌బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కడకట్ల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, వేల్పూరు ఎంపీయూపీ స్కూల్, తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉన్నాయి.

సాంకేతికత, బోధన, అభ్యసనా సామర్థ్యాల మెరుగుదల

పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో సాంకేతిక అభివృద్ధితో పాటు బోధనా, అభ్యసనా సామర్థ్యాల మెరుగుదలకు మార్గం సుగమం కానుంది. ఈ పథకం ప్రకారం పాఠశాలకు కేంద్ర ప్రభుత్వమే నేరుగా నిధులు విడుదల చేస్తుంది. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక సహకారం అందుతుంది. ఆయా పాఠశాలలకు విడతల వారీగా నిధులు విడుదల చేస్తారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమయ్యే సాంకేతిక సాధనాలను సమకూర్చుకోవచ్చు. పాఠశాలలను పర్యావరణ అనుకూల గ్రీన్ స్కూల్స్‌గా మార్చాల్సి ఉంటుంది.

పాఠశాలల్లో సోలార్‌ప్యానల్స్, ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించాలి. పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా మార్చి పర్యావరణ పరిరక్షణ కోసం సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పుతారు. విద్యార్థులు సరైన ఫలితాలు సాధించే దిశగా నైపుణ్యాలను మెరుగుపరిచే అంశాలను నేర్పుతారు. పాఠశాలల్లో ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాసు రూములు, లైబ్రరీలు, క్రీడా సామగ్రి, ఆర్ట్ రూమ్ తదితర ఆధునిక మౌలిక సదుపాయాలు సమకూరుతాయి.

39 పాఠశాలల ఎంపిక గొప్ప విషయం



ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 39 పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడం అసాధారణ విషయం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా ఇప్పటికే ఆయా పాఠశాలల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. భవిష్యత్‌లో మరిన్ని పాఠశాలలు ఎంపికయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.రవి సాగర్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

డిజిటల్ విద్యకు ఆస్కారం



ఇటీవల డిజిటల్ విద్యకు డిమాండ్ పెరిగింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పాఠశాల స్థాయి నుంచే నేర్చుకోవడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ఆస్కారం పెరుగుతుంది. స్మార్ట్ తరగతి గదులు, ల్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఆధునిక లైబ్రరీలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

– సబ్బితి నరసింహమూర్తి, మండల విద్యాశాఖాధికారి, ఏలూరు

అందుబాటులోకి అధునాతన బోధన



పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అధునాతన బోధన అందుబాటులోకి వస్తుంది. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెరగడానికి ఇదొక శుభపరిణామం. ఉపాధ్యాయుల్లో కూడా బోధనా సామర్థ్యం పెంచడానికి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్న కారణంగా వారిలో మరింత నైపుణ్యం పెరిగి తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి మార్గం సుగమమవుతుంది.

– గెద్దం సుధీర్, వైఎస్‌ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు

ఇకపై శ్రీవారి టికెట్లన్నీ ఆన్‌లైన్‌లో

ఈ నెల 18 నుంచి అందుబాటులోకి వచ్చిన కొత్త పోర్టల్



శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న సేవా టికెట్లన్నింటినీ ఇక ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా పొందొచ్చు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర దేవదాయ శాఖ ఈ నెల 18 నుంచి కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివిధ రకాల పూజలు, దర్శనం టికెట్లతో పాటు, క్షేత్రంలో నివాసిత గదులు, కాటేజీల బుకింగ్ వంటివన్నీ ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలోకి వచ్చాయి. గతంలో నిత్యార్జిత కల్యాణం, సుప్రభాతం, అష్టోత్తరం, గదుల టికెట్లు, విరాళాల చెల్లింపులు ఇలా కొన్ని సేవలు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేవి. మిగిలిన సేవా టికెట్లన్నింటిని ఆలయం వద్దకు వెళ్లి తీసుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు స్వామివారి సేవలను పొందే భక్తులు ఇంటి వద్ద నుంచే, 15–30 రోజుల ముందు జ్ట్ఞ ఇః://టీటీటీ్చ ఱ్టఠ ఞ్ఛ్ట ఇజౌఠి.జీ జ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించి, అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. భక్తులు స్వామివారి ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొనవచ్చని సూచించారు.

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న శ్రీవారి సేవలు, వాటి రుసుం

సేవ	రుసుం (రూ.లలో)
ఆర్జిత బ్రహ్మోత్సవం	516
అష్టోత్తర శతనామార్చన	300
గరుడోత్సవం/శేషవాహన సేవ	1,000
గోపూజ	116
కుంకుమ పూజ	300
నిత్యార్జిత కల్యాణం	1,500
పరోక్ష ఆర్జిత కల్యాణం	1,600
పుష్పాలంకరణ సేవ	5,116
సర్వకైంకర్య సేవ	3,116
స్నపన	301
సుప్రభాత సేవ	200
స్వర్ణ తులసిదళార్చన	2,116
వేద ఆశీర్వచనం	1,116
శాశ్వత నిత్యాన్నదాన విరాళం	2,116/ఆపైన
గోసంరక్షణ విరాళం	2,116/ఆపైన
విద్యాదానం విరాళం	1,116/ఆపైన
విమానగోపుర స్వర్ణమయ పథకం	1,116/ఆపైన
అకామిడేషన్ వసతి గదులు	200/ఆపైన

కోవిడ్ లక్షణాలుంటే పరీక్షలు నిర్వహించాలి

కలెక్టర్ పి. ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): కోవిడ్ పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, లక్షణాలు ఉన్నవారికి విధిగా కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలోని వైద్య అధికారులు, సిబ్బందితో వివిధ అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి విధిగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పాజిటివ్ వస్తే వెంటనే ఐసోలేట్ చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలన్నారు. ప్రైమరీ కాంటాక్ట్స్‌కు జాప్యం లేకుండా పరీక్షలు నిర్వహించాలని.. ప్రతి వైద్యాధికారి మాస్క్ ధరించి ప్రజలకు సందేశం పంపాలన్నారు. గర్భిణీ స్త్రీలను అప్రమత్తం చేయడంతో పాటు విధిగా మాస్కు ధరించేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా చాలా తక్కువ మందికి వైద్య పరీక్షలు జరుగుతున్నాయని, దీనికి కారణం ఆ ప్రాంత ప్రజలను ముందుగా సిద్ధం చేయకపోవడమేనన్నారు. ప్రభుత్వ వైద్యులకు మంచి సేవలను అందించడం ద్వారానే గుర్తింపు వస్తుందని, కష్టపడి చదివిన చదువు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. షెడ్యూల్ తేదీ కంటే ముందే ఆ ప్రాంతంలోని ప్రజలను షెడ్యూల్ తేదీకి వైద్య పరీక్షలకు హాజరయ్యేలా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధిగా ప్రసవాలు జరగాలన్నారు. రక్త పరీక్షల నిర్వహణలో కచ్చితమైన డేటా ఉండాలని.. రక్తహీనత కలిగిన వారి డేటాను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన వైద్యం అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించుకున్న వారి స్పందన ఫిర్యాదులపై నిర్దిత కాలంలో నివేదిక అందజేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

విద్యుత్ శాఖలో నకిలీలపై దర్యాప్తు

సాక్షి స్పందన

తణుకు: విద్యుత్ శాఖలో నకిలీ ఉద్యోగుల డొంక కదులుతోంది. గత పాతికేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్లతో నేటికీ వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఈనెల 23న 'సాక్షి'లో విద్యుత్ శాఖలో నకిలీలు పేరుతో ప్రచురితమైన కథనంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 మంది నకిలీ ఉద్యోగులకు సంబంధించిన వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదికను ఇవ్వాలని విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్‌కు సీఎండీ ఐ.పృథ్వీతేజ్ బాధ్యతలు అప్పగించారు. గత పాతికేళ్లుగా ఎలాంటి అర్హతలు లేకుండా ఉద్యోగాలు చేస్తూ సంస్థ నుంచి వేతనాలు పొందుతున్న వీరిపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కొందరు యూనియన్ నాయకుల బంధువులు సైతం నకిలీ ఉద్యోగులుగా కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరందరినీ విచారిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

పెండింగ్ చలానాలు కట్టాల్సిందే!

- జిల్లాలో గత ఏడాది కాలంలో 1,05,972 ట్రాఫిక్ చలానాలు
- చెల్లించినవి 14 వేలు మాత్రమే
- ఇంకా రావాల్సిన మొత్తం రూ.3.11 కోట్లు

సాక్షి, భీమవరం: డ్రైవింగ్ చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తే మన ప్రమేయం లేకుండా ఈ చలానాలు విధిస్తుంటారు. అయితే ఈ చలానాల్ని కట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఏడాదిలో దాదాపు 92 వేల ఈ–చలానాలు పెండింగ్‌లో ఉన్నాయంటే వాహన చోదకుల నిర్లక్ష్యం అర్థమవుతుంది. ట్రాఫిక్ నిబంధనలపై జిల్లా వ్యాప్తంగా గత నాలుగు నెలలుగా పోలీసు సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడా ఫైన్లు వేయకుండా హెల్మెట్ ఆవశ్యకత, డ్రైవింగ్ లైసెన్స్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాలతో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది ప్రతి రోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అక్కడికక్కడే డ్రైవింగ్ లైసెన్స్ ఎల్‌ఎల్‌ఆర్ ఇచ్చే విధంగా హెల్మెట్ కొనుగోలు చేసి ధరించేలా చర్యలు చేపట్టారు.

మే నెల నుంచి కఠిన చర్యలు

ఇంతవరకు నయానోభయానో చెప్పిన పోలీసు సిబ్బంది మే నెల నుంచి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడానికి సిద్ధమవుతున్నారు. గతంలో ఈ చలానాలు వేసినా పట్టించుకోకపోవడంతో వాహన చోదకుల్లో అవగాహన కల్పించడానికి పోలీసుశాఖ కృషి చేసింది.

అనేక చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి హెల్మెట్ లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని చెబుతూ కుటుంబసభ్యులు అనుభవించే వేదనను వివరిస్తూ వచ్చారు. అయినప్పటికీ పెడచెవిన పెట్టే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించేవారిపైనే కాకుండా ఈ చలానాలు చెల్లించని వారిపై కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటే మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.



భీమవరంలో హెల్మెట్ వాడకంపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రూ. 3 కోట్లపైనే పెండింగ్ చలానాలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై సుమారు 1.06 లక్షల చలానాలు విధించగా దానికి సంబంధించి ప్రభుత్వానికి సుమారు రూ.3.54 కోట్లు రావల్సివుంది. వాటిలో 14,029 చలానాలకు సంబంధించి రూ.42.49 లక్షలు మాత్రమే చెల్లించడం విశేషం. 91,942 చలానాలకు సంబంధించి దాదాపు రూ.3.12 కోట్లు వసూలు కావల్సివుంది.

జరిమానాల వసూళ్లపై దృష్టి

రద్దీ రోడ్లపై సైతం విచ్చలవిడిగా వాహనాలు నడుపుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవడానికి పోలీసుశాఖ రంగం సిద్ధం చేస్తోంది.

ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై కొంతకాలం పాటు అవగాహన నిర్వహించినా దారికిరాని వారిపై చర్యలు తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంతవరకు అవగాహన నిర్వహించిన పోలీసుశాఖ ఇక నుంచి ప్రత్యేక డ్రైవ్‌తో జరిమానాలు విధించడం, పెండింగ్ చలానా వసూళ్లపై దృష్టి పెట్టనుంది.

భద్రతే లక్ష్యం



వాహనాలు నడిపేవారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇంతవరకు అవగాహన కల్పించాం. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రయోజనాలు వివరించాం. ఇక నుంచి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జరిమానాలు విధించడం తప్పనిసరి. ఇకనైనా వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలి.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ



గణపవరం జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు ప్రశాంతి

గణపవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్లనిర్మాణంపై ఏరోజుకారోజు ప్రగతి కనిపించాలని, ఆదిశగా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ఏలూరు జిల్లానుంచి పశ్చిమగోదావరి జిల్లాలో విలీనమైన గణపవరం మండలంలో ఆమె తొలిసారిగా మంగళవారం గణపవరం, పిప్పర గ్రామాలలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు నూరు శాతం కల్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, విద్యుత్, నీటివసతి కల్పించి, ఇళ్లనిర్మాణంపై లబ్ధిదారులను సమాయత్తం చేయాలన్నారు. నిరుపేదలకు గూడు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గణపవరం లేఅవుట్‌లో ఇప్పటి వరకూ 9 ఇళ్లు పూర్తయ్యాయని, ఇంకా 100 ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని, గణపవరం కాలనీలో రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరైనట్లు అధికారులు కలెక్టరుకు వివరించారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వాటిని మూడో ఆప్షన్‌లో కాంట్రాక్టరుతో కట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. పిప్పర లేఅవుట్‌లో 33 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని గృహనిర్మాణ శాఖ పీడీ బి.పిచ్చయ్య వివరించారు. కాలనీలో పూర్తయిన ఇళ్లను ఆమె పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేయగా ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆమె అధికారులతో మండలంలో ఇళ్లనిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, అందువల్ల లబ్ధిదారులంతా ఇళ్లనిర్మాణాలు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీఓ జ్యోతిర్మయి, డీఈ ప్రసాదు, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, పిప్పర సర్పంచ్ కాకర బేబీ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఫెర్రీ వేలం ఖరారు

పోలవరం రూరల్: పోలవరం – పురుషోత్తపట్నం ఫెర్రీ వేలంపాట ఉభయగోదావరి జిల్లాల అధికారుల సమక్షంలో పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ వేలంపాటను పురుషోత్తపట్నానికి చెందిన రత్నాజీరావు రూ.12.19 లక్షలకు పాడుకున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస బాబు చెప్పారు. ఎక్కువ పాటదారుడైన రత్నాజీరావుకు ఫెర్రీని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, ఈవోపీఆర్డీ నిఖిల్‌మధు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, ఆటోలు

పోలవరం రూరల్: రెండు ట్రక్కు ఆటోలలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టివేశారు. జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన రూ.1.14 లక్షల విలువ గల 57 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టిసం ప్రాంతంలో చేసిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి నుంచి కన్నాపురం, పోలవరంలోని కన్నాపురం అడ్డరోడ్డు మీదుగా రాజమండ్రికి ఈ వాహనాలను తరలిస్తున్నట్లు గుర్తించి ఇద్దరు ఆటోడ్రైవర్లపై 6ఎ కేసు నమోదు చేశారు. తహసీల్దార్ బి.సుమతి ఆదేశాలు మేరకు పట్టిసం షాపు వద్ద బియ్యాన్ని భద్రపరిచారు. సదరు రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎస్సై ఎస్ఎస్ ప్రసాద్, వీఆర్వో ఎంఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ప్రభుత్వ ప్రోత్సాహం

- గ్రామ స్వరాజ్యం సాకారం దిశగా పల్లెలు
- 9 అంశాల్లో అభివృద్ధి, కృషి వెలుగులోకి
- ఇతర గ్రామాలకు ఆదర్శంగా కార్యక్రమాలు
- పశ్చిమలో 22 గ్రామాలకు జిల్లా అవార్డులు
- ఏలూరు జిల్లాలో 12 పంచాయతీలకు..



పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఏలూరు(మెట్రో)/భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పల్లెల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ప్రోత్సహిస్తోంది. వీటిలో ప్రధానంగా గ్రామాల్లో మెరుగైన జీవనోపాధి, అన్ని వయస్సుల వారికి ఆరోగ్యకర జీవన విధానం, బాలల మనుగడ, అభివృద్ధి, రక్షణ, హక్కులు పొందేలా చర్యలు, నాణ్యమైన తాగునీటి సరఫరా, ప్రతి ఇంటికీ నీరు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సురక్షితమైన గృహాలు, ప్రాథమిక సేవలు, సామాజిక సురక్షితం, సామాజిక భద్రత, సుపరిపాలన, సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత, లింగ సమానత్వం, బాలికలకు సమాన అవకాశాలు తదితర 169 లక్ష్యాలను గ్రామాలు సాధించాలి. వీటిని సాధించేందుకు ఆయా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసి ఆయా రంగాల్లో పంచాయతీలు అభివృద్ధి చెందాలని సూచించింది. ఈ మేరకు ఆయా అంశాల్లో విశేష కృషి చేసిన గ్రామ పంచాయతీలను పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఈ అవార్డులను అందజేసింది. రాష్ట్ర స్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాలో పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామం మైనర్ పంచాయతీ అవార్డు సాధించింది. ఆదాయం తక్కువనే భావన పక్కన పెట్టి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను చక్కగా వినియోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటూ, సచివాలయంలోని ఆయా శాఖల ఉద్యోగులను, కార్యదర్శి, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ గ్రామ సర్పంచ్ కుచ్చర్లపాటి మంగతాయారు గ్రామ ప్రజలకు మెరుగైన సేవలను అందించారు. అలాగే జీవనోపాధి మెరుగుపర్చడం, ఆరోగ్యవంతమైన, బాలల స్నేహపూర్వక, పుష్కల నీటి వనరులు తదితర అంశాల్లో జిల్లా స్థాయిలో 4 అవార్డులు, రాష్ట్ర స్థాయిలో 1, మండల స్థాయి 6 అవార్డులు కలిపి మొత్తం 11 అవార్డులు అందుకుంది. అలాగే ఏలూరు జిల్లాలోని భీమడోలు మండలం సూరప్పగూడెం పంచాయతీని రాష్ట్ర అవార్డు వరించింది. గ్రామాభివృద్ధి ప్రణాళికలో స్వయం సమృద్ధి, మౌలిక వసతుల కల్పన అనే అంశాల్లో సర్పంచ్ వెజ్జు బాలాజీనాయుడు చేసిన కృషికి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందింది. అలాగే జిల్లా స్థాయిలో ఏలూరు జిల్లాలో 12, పశ్చిమగోదావరి జిల్లాలో 22 పంచాయతీలు అవార్డులను దక్కించుకున్నాయి. గ్రామాలు మరింత అభివృద్ధి చెందేందుకు ఈ అవార్డులు దోహదం కానున్నాయి. అదేవిధంగా మిగిలిన పంచాయతీలకు స్ఫూర్తిగా నిలిచాయి.

సంతోషంలో సర్పంచ్‌లు

సేవ చేయాలని తపనతో సర్పంచ్‌లుగా ఎన్నికై నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ ఓ వైపు అభివృద్ధి, మరో పక్క ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు పారదర్శకంగా చేర్చడంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న సర్పంచ్‌ల సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డులతో సత్కరించడం చాలా సంతోషంగా ఉందని అవార్డులు అందుకున్న ఆయా గ్రామాల సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవలు అందిస్తామని వారు అంటున్నారు.

వచ్చే ఏడాది మరిన్ని గ్రామాలకు అవార్డులు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వచ్చే ఏడాది నాటికి మరిన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాలు పూర్తిస్థాయిలో అన్ని రంగాల్లో లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తాం. అధికారులకు గ్రామస్తులు సహకారం అందిస్తే నూరుశాతం లక్ష్యాలు సాధ్యమే.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

గ్రామస్తుల సహకారంతోనే రాష్ట్ర అవార్డు



నెలమూరు గ్రామానికి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఇవే కాక జిల్లా స్థాయిలో నాలుగు అవార్డులు, మండల స్థాయిలో 6 అవార్డులు రాష్ట్ర స్థాయిలో ఒకటి చొప్పున 11 అవార్డులు రావడం చాలా గర్వంగా ఉంది. అధికారులు, ఉద్యోగులు,, వలంటీర్లు, గ్రామస్తులు సహకరించారు. ఈ అవార్డులిచ్చిన ప్రోత్సాహంతో మరింతగా సేవలందిస్తాం.

– కుచ్చర్లపాటి మంగతాయారు, సర్పంచ్, నెలమూరు, పెనుమంట్ర మండలం

గ్రామాన్ని అన్నింటా అభివృద్ధి చేశాం



దిరుసుముర్రు గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి అవార్డు, మండల స్థాయిలో 8 కలిపి మొత్తం 9 అవార్డులు వచ్చాయి. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రోత్సాహం, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తుల పూర్తి సహకారంతో గ్రామాన్ని అన్నింటా అభివృద్ధి చేశాం. గ్రామంలో అభివృద్ధిని గుర్తించి ప్రభుత్వం అవార్డులను అందించడం అభినందనీయం.

– కోళ్ల బాలకృష్ణ, సర్పంచ్, దిరుసుముర్రు, భీమవరం మండలం

పచ్చదనం, పరిశుభ్రతలో జిల్లా అవార్డు



విస్సాకోడేరు గ్రామానికి పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో జిల్లా స్థాయి అవార్డు వచ్చింది. అలాగే పలు విభాగాల్లో మండల స్థాయిలో మరో నాలుగు అవార్డులు అందుకున్నాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనం కోసం మొక్కలు నాటించడమే కాక వాటి సంరక్షణను పంచాయతీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాం.

– బొల్లా శ్రీనివాస్, సర్పంచ్, విస్సాకోడేరు, పాలకోడేరు మండలం

మా కృషిని ప్రభుత్వం గుర్తించింది



నాగిడిపాలెంలో గ్రామ పంచాయతీ సుపారిపాలన, స్వయం సమృద్ధి, బాలల స్నేహపూర్వ గ్రామం, సామాజిక న్యాయం విభాగాల్లో మండల స్థాయి అవార్డులు వచ్చాయి. ఈ విభాగాల్లో మేం చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది. గ్రామ ప్రజల సహకారంతోనే ఈ అవార్డులు సాధించాం.

నాగిడి దుర్గాభవాని, సర్పంచ్, నాగిడిపాలెం, భీమవరం మండలం

బ్యాడ్మింటన్‌లో విష్ణు డెంటల్ విద్యార్థుల ప్రతిభ



బ్యాడ్మింటన్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

సాక్షి, భీమవరం: అంతర కళాశాలల పురుషుల గేమ్స్ మీట్ బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణంలోని శ్రీవిష్ణు డెంటల్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ సజ్జన్ చెప్పారు. మంగళవారం కళాశాలలో విజేతలను అభినందించిన సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. నెల్లూరులో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 25వ అంతర కళాశాలల గేమ్స్‌మీట్ నిర్వహించారన్నారు. ఈ మీట్‌లో బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన కె.సంతోష్, వి.ఆంజనేయులునాయక్, పి.వంశీకుమార్, ఎంటీ వర్ధన్‌రెడ్డి, ఎ.సోహన్‌దత్తా బృందం ప్రథమ స్థానంలో నిలిచి బహుమతిని అందుకున్నారన్నారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ ఎంఎకేవీ రాజు, ప్రిన్సిపాల్ సురేష్ సజ్జన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రామరాజు, పీడీ జీబీఎస్ కుమార్‌రాజు అభినందించారు.

కట్నం కోసం వేధిస్తున్న ఐదుగురిపై కేసు

పాలకోడేరు: పెళ్లి అయ్యి నాలుగు మాసాలు పూర్తి కాకుండానే అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పెన్నాడ గ్రామానికి చెందిన మైపాల రజిత (19)కు అదే గ్రామానికి చెందిన సూరిబాబుతో గత ఏడాది డిసెంబర్‌లో వివాహమైంది. కొన్నాళ్లు సజావుగా కాపురం సాగిన అనంతరం రజితను అదనపు కట్నం కోసం కుటుంబ సభ్యులు వేధించడం మొదలు పెట్టారు. దీంతో వేధింపులు భరించలేక రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త సూరిబాబు, అప్పారావు, శ్రీనువేణు, వంశీ, అత్తలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు



తణుకులో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సామగ్రితో మునిసిపల్ కమిషనర్ సుధాకర్

తణుకు అర్బన్: నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ హెచ్చరించారు. తణుకులో మంగళవారం వ్యాపారుల నుంచి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కంటే తక్కువగా ఉన్న అన్ని రకాల ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు, కత్తులు, స్ట్రాలు, ప్లాస్టిక్ పేపర్ రోల్సు వంటి సామగ్రి వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో రూ.4 వేలు జరిమానా వసూలుతోపాటు 15 కేజీల ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనపరచుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీవారి గ్రామోత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీదుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: క్షేత్ర పురవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. చాత్మార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం శ్రీవారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట స్వామివారికి భక్తులు నీరాజనాలు సమర్పించారు.

ఆదిశంకరాచార్యులకు గ్రామోత్సవం



శ్రీవారి క్షేత్రంలో పల్లకీలో ఆదిశంకరాచార్యునికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదిశంకరాచార్యుని జయంతి మంగళవారం ఘనంగా జరిగింది. క్షేత్రపాలకుని ఆలయంలో ముందుగా అర్చకులు, పండితులు ఆదిశంకరాచార్యుని ఉత్సవ మూర్తికి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం గర్భాలయంలో శివదేవుని వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. తరువాత ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి వాహనంలో ఆదిశంకరాచార్యుని చిత్రపటాన్ని, ఉత్సవమూర్తిని ఉంచి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆదిశంకరాచార్యుని విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయానికి చేరుకున్న తరువాత శంకరాచార్యునికి విశేష పూజలను జరిపారు.

కనులపండువగా అమ్మవార్ల తెప్పోత్సవం



కాళ్లలో గ్రామదేవతలు శ్రీమహంకాళమ్మ వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం వెనుక వైపు ఉన్న పెదపాపాయమ్మ చెరువులో అమ్మవార్ల తెప్పోత్సవం సోమవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. బాణసంచా కాల్పుల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్ల తెప్పోత్సవాన్ని వీక్షించారు. - కాళ్ల

● గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు: కుముదవల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

జీఈఏ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లాం విద్యాసాగర్

ఏలూరు (మెట్రో): రాజమహేంద్రవరంలో ఈనెల 30 జరిగే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షులు లాం విద్యాసాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ప్రభుత్వ డాక్టర్ల సంఘం భవనంలో సంఘం ఏలూరు తాలూకా కార్యవర్గ సమావేశం అధ్యక్షులు వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లాం విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రంలో భారీ స్థాయిలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతున్న సందర్భంగా జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ కార్యక్రమాన్ని హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల నాయకులు రవిశంకర్, జ్యుడీషియల్ నాయకులు మాదిరెడ్డి రాము, నాయకులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, ట్రెజరర్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.2 లక్షల మంజూరు



సీఎం సహాయ నిధి నుంచి సొమ్ము మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం మండలం నూతనగూడేనికి చెందిన బాలుడి వైద్యానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బాలుడి తండ్రికి అందించాడు. వివరాలిలా ఉన్నాయి. తాపీమేస్త్రిగా పని చేసే పరిణికాని సురేష్, చాందిని దంపతులకు పుట్టిన మగబిడ్డ సోహాన్ సాయి ఈశ్వర్‌కు పుట్టుకతోనే తల, నుదుటిపై కణితులు ఉన్నాయి. వెంటనే వైద్యులకు చూపించగా ఆ బాలుడు ఎదిగే క్రమంలో అవి తగ్గుతాయని తెలిపారు. అయితే వయస్సుతో పాటు తల, కంటిపై ఉన్న కణితులు క్రమేపీ పెరగడంతో వారు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు బాలుడికి అత్యవసరంగా ఆపరేషన్ చేయించాలని, అందుకు రూ. 2 లక్షల ఖర్చవుతుందని తెలిపారు. దీంతో సురేష్, చాందిని దంపతులు ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆశ్రయించగా ఆయన సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేయగా సొమ్ము మంజూరైంది. తమ బిడ్డ ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బాలరాజులకు సురేష్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

భీమడోలు: బాలిక అదృశ్యంపై భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్లితే.. భీమడోలులోని బాలిక స్థానికంగా ఉన్న ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఆలయం వద్ద ముగ్గు వేసి వస్తానని తల్లికి చెప్పి వెళ్లిన బాలిక ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, పరిసర గ్రామాల్లో ఆమె కోసం వెతికారు. మంగళవారం తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

క్లుప్తంగా

సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం


విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న లియో క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, వశిష్ట లియో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలో క్లబ్‌లు ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ ఆశ్రమంలో పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారం, స్టేషనరీలను ప్రముఖ దంత వైద్యురాలు కమల ఎస్తేర్ చేతుల మీదుగా అందజేశారు. అంతర్జాతీయ లయన్స్‌క్లబ్‌కు 100 డాలర్లు విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ సభ్యులు మాధురి, సంపత్, ప్రజ్ఞ, సాయి శృతి, శిరీషా, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వాస్తవ స్థితిగతులపై అధ్యయనం


పెంటపాడులో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖలోని వాస్తవ పరిస్థితులను పూర్తిగా అధ్యాపకులు అధ్యయనం చేయాలని ఎంఈవో ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలువురు ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్పీ స్వామి ఉపాధ్యాయులు వినియోగించాల్సిన యాప్‌లపై శిక్షణ, సందేహాలను నివృత్తి చేశారు.

వేల్పూరులో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని మెయిన్ సెంటర్‌లో కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రయాణీకులు, పాదచారులకు కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు దాట్ల రంగావతి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ శేషుకుమారి, ఎంపీటీసీలు రెడ్డి హైమా, చుండ్రు శ్యామల, విజయదుర్గ, నాయకులు నున్నా దుర్గ ప్రసాద్, కరెళ్ల వర ప్రసాద్, రమణమూర్తి, రెడ్డి సత్తిరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలు పని విధానం రద్దు చేయాలి

పెంటపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో రెండు పూటలు పని విధానం రద్దు చేయాలని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెంటపాడు మండలం కె. పెంటపాడు గ్రామంలో వ్యవసాయ కార్మికులను కలిసి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవన విధానాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలి

పెంటపాడు: విశ్వాసులు ఆధ్యాత్మిక జీవనాన్ని పెంపొందించుకొని క్రీస్తుకు విధేయులై జీవించాలని హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ జెర్మియా పేర్కొన్నారు. గూడెంలోని కడకట్ల క్రైస్తమాస్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన క్రీస్తు రక్షణ సువార్త కూడికలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా సభల కన్వీనర్ బుంగా విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్యారిష్ పాస్టర్ రెవ. జి. చిన్నం రాజు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పాస్టర్ జెర్మియా మాట్లాడుతూ ఇహలోకంలో క్రీస్తు బోధించిన బోధనల సారంగా విశ్వాసులు అంత్యదినాల్లో ఆధ్యాత్మికతను వృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దైవసేవకులతో పాటు, క్రైస్తమాస్ లూథరన్ చర్చిసంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సండే స్కూలు విద్యార్థులు, గాడ్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి
- వేల్పూరులో గృహసారథులు, వలంటీర్లు, అధికారులతో సమీక్ష సమావేశం


వేల్పూరులో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని గీతామందిరంలో జరిగిన మండల స్థాయి అధికారులు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ వలంటీర్లు గడప వద్దకే అందజేస్తున్నారని చెప్పారు. ఇంతటి బృహత్తరమైన పథకాలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. గత పాలకులు రాష్ట్రంలోని వనరులన్నీ దోచుకోవడం, దాచుకోవడం మాదిరిగా పాలన చేశారని చెప్పారు. ప్రస్తుతం ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కడం సంక్షేమ పథకాలన్నీ డైరెక్ట్‌గా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోనే జమ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంమే ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా ధాన్యం కొనుగోలు చేసి దళారి వ్యవస్థల లేకుండా చేసినట్లు తెలిపారు. వేల్పూరు గ్రామంలో గతంలో పేదల ఇళ్ల స్థలాల కోసం తాను సేకరించిన భూమిని మధ్యలో వచ్చిన తెలుగుదేశం పార్టీ కోర్టుల్లో కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని చెప్పారు. గ్రామంలోని 1,389 మంది పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వడం జరిగిందన్నారు. వేల్పూరు గ్రామాన్ని తాను స్వయంగా పర్యవేక్షించి ప్రతి నెలా గ్రామ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తానని చెప్పారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రతి సామాజిక వర్గం నుంచి ప్రతినిధుల ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో ఏ పార్టీకి లేని విధంగా మన రాష్ట్రంలో 5 లక్షల 40 వేల మంది గృహ సారథులున్నారని చెప్పారు.

మండల పార్టీ అధ్యక్షుడుగా బోడపాటి వీర్రాజు

తణుకు రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా బోడపాటి వీర్రాజును నియమిస్తున్నట్లు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈ సమావేశంలో ప్రకటించారు. గతంలోనూ మండల పార్టీ అధ్యక్షుడుగా వ్యవహరించిన బోడపాటి తర్వాత జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈసమావేశంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును గ్రామ నాయకులు నున్న దుర్గా ప్రసాద్, కరెళ్ల వర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. నూతన మండల పార్టీ అధ్యక్షుడుగా నియమితులైన బోడపాటి వీర్రాజు పలువురు నాయకులు అభినందించారు. నాయకురాలు దాట్ల రంగావతి, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఎంపీడీవో టీఎస్ మూర్తి, వైస్ ఎంపీపీ శేషుకుమారి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, యూత్ అధ్యక్షుడు ఫణీంద్ర, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి హైమా, చుండ్రు శ్యామల, విజయ దుర్గ, వెంకట లక్ష్మి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పానసోనిక్ స్టేట్ ఏరియా మేనేజర్ టి.సుధాకర్

తాడేపల్లిగూడెం రూరల్: సాంకేతికతపై ఫొటో, వీడియోగ్రాఫర్లు అవగాహన పెంచుకోవాలని పానసోనిక్ రాష్ట్ర ఏరియా మేనేజర్ టి.సుధాకర్ అన్నారు. ఏరియా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉషా గ్రాండ్‌లో ఫొటో, వీడియో కెమెరాల సాంకేతికతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మిర్రర్ లెస్ కెమెరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయని, సీనియర్లు వాటి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మిర్రర్ లెస్ కెమెరాల వల్ల అత్యధిక నాణ్యత, తక్కువ సమయంలోనే ఎక్కువ ఫొటోలను తీయవచ్చన్నారు. ఫ్యాకల్టీలు జి.శివాజీ, రఘు గౌడ్ ఫొటో, వీడియోగ్రాఫర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీలర్ తూనుగుంట్ల మూర్తి, ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మరడాని పరశురామ్ (రాము), ఏరియా ఉపాధ్యక్షుడు కొడమంచిలి ఆశీర్వాదరావు, కోశాధికారి కూడవల్లి ధనరాజు, కార్యదర్శి ఎ.సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ముళ్ళపూడి చిరంజీవి, కార్యదర్శి జడ్‌సిక్స్ సురేష్, వివి.రమణ, పెద్దోజు మురళీకృష్ణ, ఎస్ఆర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ రాష్ట్రం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి బిల్లు పంపించడం హర్షణీయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. పట్టణంలో మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మంగరాజు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 15 నుంచి 22 వరకు, ఎస్టీలకు 7 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నారు. అంబేడ్కర్ ఫొటోను భారత్ కరెన్సీ నోట్లు మీద ముద్రించాలని, రాజ్యాంగం దినోత్సవం రోజున అంబేడ్కర్ ఫొటో పెట్టి జెండా వందనం చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితులకు స్మశానాలు లేని చోట ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసి ఒక ఎకరం నుంచి మూడు ఎకరాలు వరకు ఇవ్వాలని, స్మశానాలు ఆక్రమించిన వారిపై సర్వేలు చేయించి చర్యలు తీసుకోవాలని, దళితులకు వాటిని అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భరత్, త్రిమూర్తులు, బాలకృష్ణ, జగజ్జీవన్, విజయరాజు పాల్గొన్నారు.

శీతల పానీయాలకు యమ డిమాండ్

- విరివిగా చెరకురసం దుకాణాలు
- వేసవి తాపాన్ని తీర్చుతున్న పానీయం


అత్తిలిలో చెరకురసం విక్రయిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి తాపంలో ప్రతి ఒక్కరి చూపు చెరకు రసంపైనే ఉంటుంది.దీనికి అనుగుణంగా చెరకు రసం విక్రయ దుకాణాలు పెరిగాయి. వ్యాపారులూ పెరిగారు. రూ.30వేల నుంచి రెండు లక్షల మధ్య చెరకు రసం మెషిన్లు రావడంతో నిరుద్యోగ యువత కొందరకు దీనివైపు మొగ్గుచూపుతున్నారు. మరో కోణంలో చూస్తే చక్కెర కర్మాగారాలు మూతపడడంతో ముదురు, లేత, మధ్యస్తంగా ఉన్న చెరుకు ఈ రసం విక్రయించే వ్యాపారులు కొనుగోలు చేసేస్తున్నారు. ముదురు చెరకు ఆరోగ్యకరమైనది కాగా, లేత చెరకు రసానికిపనికిరాదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే కర్మగారాలు లేక పోవడంతో చక్కెర దిగుబడి కూడా తగ్గిపోయింది. అలాగే కొతుల బెడద సైతం ఎక్కువగా ఉండడంతో రైతులు సైతం సాగుకు ముందుకు రావడం లేదు.

ఐస్‌కు చెక్.. ఫ్రిజ్‌లలోనే ముక్కలు...

సంప్రదాయ రసం తీసే క్రషర్ల స్థానంలో విద్యుత్ యంత్రాలు రావడంతో ఐస్ ముక్కలతో కాకుండా నేరుగా ఫ్రిజ్‌లోనే చెరకు ముక్కలు నిల్వచేసుకొనే సౌలభ్యం వచ్చింది. దీంతో ముడి చెరకు రసంలో నిమ్మకాయ కలిపి, అవసరమైతే ఐస్ కలిపి విక్రయిస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో 35 వరకు చెరకు రసం దుకాణాలు ఏర్పాటయ్యాయి.

సేంద్రియ చెరకు రసం..

సేంద్రియ విధానంలో పండించిన చెరకు నుంచి రసం తీసి విక్రయిస్తే ఆరోగ్యం. వేసవిలోనే చెరకు రసానికి డిమాండ్ ఉంటుంది. దీంతో రూ.1.25లక్షలతో యంత్రం కొనుగోలు చేసి రసాన్ని విక్రయిస్తున్నా. అత్తిలి మండలంలో చెరకు గెడలను రూ.180లకు కొనుగోలు చేస్తున్నాం. గ్లాస్ చెరకు రసం రూ.10 నుంచి రూ.20 వరకు, అర లీటర్ 30, లీటర్ రూ.60కి విక్రయిస్తున్నాం. ఇద్దరి యువకుల సాయంతో విక్రయాలు సాగిస్తున్నాని రవి తెలిపారు.

ఏపీ సీడ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: తణుకు ఏపీ సీడ్స్‌లో కాంట్రాక్టు విధానం రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఏపీ సీడ్స్ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీ సీడ్స్ కార్మికుల ఆందోళనకు సీఐటీయూ పూర్తి మద్దతునిస్తుందని జిల్లాలో అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఘనంగా శంకర జయంత్యుత్సవాలు


శంకర మఠంలో విశేష పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని చిన్న వంతెన వద్ద వేంచేసియున్న ఆదిశంకరాచార్య స్వామి దేవస్థానం శంకరమఠంలో మంగళవారం శంకర జయంతి మహోత్సవాలు పురస్కరించుకొని శంకర భగవత్పాదులకు విశేష పూజలు అభిషేకాలు జరిగాయి. గోపురం నిర్మాణ ప్రతిష్ట కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిష్ట కరపత్రాలను ఆవిష్కరించారు. గరికపాటి బాపయ్య శర్మ, ఓగేటి పండు, ఆదూరి కృష్ణమోహన్, కె.భాస్కర్ శర్మ, ధూళిపాళ ఆదిత్య తదితరులు గణపతి పూజ, పరివార దేవతల విశేష పూజల్లో పాల్గొన్నారు. రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో మంగళవారం శంకరజయంతిని పురష్కరించుకొని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మందిర అధ్యక్ష, కార్యదర్శులు కొల్లెపర పాండురంగారావు, ఇందుకూరి మోహన్‌రాజులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన


జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్ ముడిపడి ఉందని, రాబోయే రోజుల్లో జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు మంగళవారం పెంటపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో పాల్గొని పలు వార్డుల్లో ఇంటింటికి తిరిగారు. స్టిక్కర్‌లు అంటించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న ప్రచారాల్లో వాస్తవం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణిబాబి, పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కర్రి వరహాలరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, యూత్ నాయకులు కర్రి పృధ్వీకుమార్ రెడ్డి, వార్డు సభ్యులు జయబాబు, రెడ్డి శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి


వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జేఎన్‌టీయుకే, శశి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవాపథకంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రినిటీ ఆసుపత్రి, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో వైద్యులు గౌతమి, సూర్యసుభాషి, జయవర్ధినిలు పిల్లలు, మహిళలు, జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శశి విద్యాసంస్థల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ కె.భానుప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ వెంకట సాయిబాబా మందిరంలో 12వ వార్షికోత్సవ మహోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మందిరం వ్యవస్థాపకుడు చైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబి) ప్రత్యేక పూజలు బాబా హారతి, పుణ్యాహావాసన, అసస్త దీపారాధన, దీక్ష స్వీకరణ, ఋత్విక్ వరుణ, మేదిని పూజ (పుట్టమట్టి పూజ) అంకురార్పణ, నివేదన, హారతి, మంత్రపుష్పం పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు మందిరం ప్రధాన అర్చకులు పి నారాయణ శేషకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లినీడి సుధాకర్ సాయి భక్తులు హౌసింగ్ బోర్డు, ప్రజలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత


దువ్వలో మలేరియా అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీపీ యూనిట్ వైద్యాధికారి డా.బి.దుర్గామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మంగళవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ సుప్రియ, పృధ్వీరాజ్, రాజా నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ దోమల వ్యాప్తిని నిరోధించడం ద్వారా మలేరియాను అధిగమించవచ్చని అన్నారు. దోమ పుట్టుకకు కారణాలైన పరిసరాల పరిశుభ్రత, నీటినిల్వలు లేకుండా చూసుకొనుట వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర రావు, లెప్రసీ పారామెడికల్ ఆఫీసర్ జీవీ మీఎస్ మూర్తి, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాస్, ఎస్ తాతాజీ, సచివాలయ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని ఇరగవరం పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు వివిఎల్ కాంతిరెడ్డి మాట్లాడుతూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. విధిగా దోమ తెరలు వాడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి వి మూర్తి, సీహెచ్‌వో రామరాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ద్వారానే మలేరియాకు దూరం

తణుకు టౌన్: పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమలను నిర్మూలించడం ద్వారానే మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కేఎం రత్నకిషోర్ చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తణుకు రూరల్ మండలం దువ్వ, ముద్దాపురం, తేతలి, గ్రామాల్లో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఏ శ్రీరామమూర్తి, ఎంపీ వెంకట్రావు, బీఎంఎస్ రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియాను అరికట్టేందుకు కృషి చేద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు వీకర్స్‌కాలనీ, బీబీ సెంటర్, కడకట్ల, యాగర్లపల్లి పరిధిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధా అధ్యక్షతన ఆశాలకు, ఆరోగ్య కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులతో పాటు, వార్డు వలంటీర్లు, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఇరగవరంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


తాడేపల్లిగూడెం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం